క్లుప్తంగా

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా బుధవారం పెనుమళ్ళలో జరగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సౌజన్య అన్నారు. మంగళవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ సూరంపూడి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరుగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, సుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధుల పైన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తామని రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందించటం జరుతుందన్నారు.

విశ్వనాథరాజు హఠాన్మరణం


మంతెన విశ్వనాథరాజు

కె.గంగవరం: మండలంలోని బ్రహ్మపురి మాజీ సర్పంచ్, సొసైటీ అధ్యక్షుడు మంతెన విశ్వనాథరాజు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. బ్రహ్మపురి సర్పంచ్‌గా, గ్రామ సొసైటీ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం వ్యవహరించి గ్రామాభివృద్ధికి, సొసైటీ పురోగతికి నిస్వార్థ సేవలందరించారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు విశ్వనాథరాజు అత్యంత సన్నిహితులు. ఇద్దరు ఒకేసారి గ్రామ సర్పంచ్‌లుగా రాజకీయ అరంగేట్రం చేయడమే కాకుండా ఇప్పటికే వీరు మంచి స్నేహితులు. 1980లో గోదావరికి వరద ఉధృతి ఎక్కువ కావడంతో బ్రహ్మపురి గ్రామం వద్ద గట్టు గండి పడకుండా ప్రజలను కాపాడి అప్పట్లో అంకితాభావంతో సేవ చేయడాన్ని ఇప్పటికీ ఆ గ్రామ ప్రజలు ఆయన్ని అభినందిస్తారు. ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. విశ్వనాథరాజుకు భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బాల భక్తాంజనేయ స్వామి సంబరం


జగన్నాయకులపాలెంలో బాల భక్తాంజనేయ స్వామి ఆలయంలో సంబరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో వేంచేసిన బాల భక్తాంజనేయస్వామి సంబరం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా మహా శివరాత్రి ముందు వచ్చే మంగళవారం నిర్వహించడం ఆనవాయితీగా ఉండగా గత కొంతకాలంగా చేయడం లేదు. అయితే గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ గత నాలుగు సంవత్సరాలుగా మళ్లీ నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు నక్కిన దొరబాబు, కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూర్తయిన పల్స్ పోలియో లక్ష్యం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలలో నిర్దేశించుకున్న పోలియో చుక్కల లక్ష్యాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం పూర్తి చేశారు. అంగర పీహెచ్‌సీలో 1,294 మందికి పోలియో చుక్కలు వేయాలన్నది లక్ష్యం కాగా నూరుశాతం పూర్తి చేసినట్టు వైద్యాధికారి పి.రత్నకుమారి తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునరావు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలను ఆమె అభినందించారు. వాకతిప్ప పీహెచ్‌సీలో 1,511 లక్ష్యాన్ని పూర్తి చేసినట్టు వైద్యాధికారి పి.చంద్రమౌళి తెలిపారు. ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, వైద్య,ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. కార్యక్రమం ప్రారంభమైన ఈనెల 3న వాకతిప్పలో 97 శాతం , అంగరలో 98 శాతం పూర్తయింది.


ఉచిత విద్యకు దరఖాస్తులు చేసుకోండి

రాయవరం: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాల్సి ఉందన్నారు. అనాథలు, దీర్ఘకాలిక వ్యాధి గల చిన్నారులు, దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, పేదలైన ఓసీ కులానికి చెందిన చిన్నారులకు 6 శాతం సీట్లు కేటాయిస్తారని ఆయన తెలిపారు. 2018 ఏప్రిల్ 2 నుంచి 2019 మార్చి మధ్యలో జన్మించిన చిన్నారులు ఒకటో తరగతిలో చేరడానికి అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసముంటున్న చిన్నారుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంత చిన్నారుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.40లక్షలకు మించకుండా ఉండాలని ఏపీసీ తెలిపారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- పక్వానికి రాకముందే పండ్ల విక్రయాలు
- రసాయనాలతో మాగబెడుతున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


రసాయనాలతో మగ్గించిన అరటిపండ్లు


రంగుమారిన బొప్పాయి

కె.గంగవరం: ఆహారం తీసుకున్న తరువాత ఏదో ఒక ఫలం తింటే ఆరోగ్యం చేకూరుతుందని నానుడి. దీనికి బలం చేకూర్చే విధంగా వైద్యులు కూడా ప్రతి రోజు ఫలాలను తినాలని సూచిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రసాయనాలతో మగ్గించిన పండ్లను విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నియోజకవర్గమైన రామచంద్రపురం పట్టణంతో పాటు కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్‌తో పాటు మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పలు చోట్ల ఈ రకం విక్రయాలు జరుగుతున్నాయి. అరటి, బొప్పాయి, ద్రాక్ష, దానిమ్మ చూడగానే కొనాలనిపించే విధంగా పైకి కనిపిస్తున్నా వాటిని తినేసరికి రుచి ఉండకపోవడం కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోసపోతున్న ప్రజలు

వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా పక్వానికి రాని పండ్లను రసాయనాలతో మాగబెట్టి ప్రజలకు విక్రయిస్తున్నారు. గొడౌన్లలో బొప్పాయి, అరటిపండ్లపై రసాయనాలు పిచికారీ చేయడం వల్ల పసుపు రంగులోకి మారుతున్నాయి. పైకి తాజాగా కనిపించడంతో వీటిని ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రసాయనాలతో మగ్గిన పండ్లని తెలియక రోగాలను సైతం కొనితెచ్చుకుంటున్నారు. ప్రజారోగ్యం గురించి పట్టించుకోవల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీరి తీరుపై కొనుగోలుదారులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సహజ సిద్ధంగా పండిన పండ్లలో సమృద్ధిగా పోషక పదార్థాలు ఉంటాయని, కృత్రిమ పద్ధతిలో మాగబెట్టిన పండ్లను తింటే అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నామమాత్రంగా అధికారులు

మార్కెట్లలో ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి. రసాయనాలు పిచికారీ చేసి విక్రయిస్తున్నా వారు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యాపారాలు ఇదే అదనుగా భావించి పండ్ల విక్రయాలు చేపడుతున్నారు. దీంతో పాటు తూకంలోనూ తేడాలు చూపిస్తున్నా ఎవరూ ప్రశ్నించలేని పరిస్థితి తయారైంది. రేటు కూడా వ్యాపారులు ఇష్టం వచ్చిన రేట్లు అమ్ముతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

చట్టాలు ఉన్నప్పటికీ..

ఆహార భద్రత చట్టం 2006 (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ యాక్ట్) ప్రకారం ప్రజారోగ్యాన్ని కాపాడవల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది. పండ్లపై కార్బైడ్ వినియోగం నిషేధించాలని, వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టులు ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు పక్వానికి రాకముందే పచ్చికాయలను కార్బైడ్ , ఇతర రసాయనాలతో పండిస్తున్నారు. అధికారులు స్పందించి సహజ సిద్ధంగా లభించే పండ్లను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సహజ సిద్ధంగా ఇలా..

- పక్వానికి వచ్చిన మామిడి, అరటి, సపోటా, బొప్పాయి కాయలను కోసిన తర్వాత జీడి ఆరిపోయే వరకు చెట్టుకింద ఆరబెట్టాలి.
- చీకటి గదిలో వరి గడ్డి, మునిడి ఆకులు వేసి మగ్గబెట్టాలి. ఇలా సహజ సిద్ధంగా ముగ్గిన పండ్లు రుచిగా ఉంటాయి.
- ఈ పండ్లు గుర్తించడం తేలికే, నిగనిగలాడేంత పసుపురంగులోకి పూర్తి మారవు, అక్కడక్కడా ఆకుపచ్చ రంగు ఉంటుంది.

అధికారులు చొరవ చూపాలి

ప్రస్తుతం పండ్లను కొనుగోలు చేసినా రుచిగా ఉండడం లేదు. రోజు పండ్లు తినాలని వైద్యులు చెబుతున్నారు. కానీ పండ్లు రసాయనాలతో మగ్గించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. అధికారులు వ్యాపారులను పర్యవేక్షించాలి.
– తోకల శ్రీను, తామరపల్లి

కఠిన చర్యలు తీసుకోవాలి

చిన్నారుల నుంచి పెద్దల వరకు పండ్లనే ఎక్కువగా ఇష్టపడతారు. వాటిని రసాయనాలతో విషతుల్యం చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
– దూడల నాగేశ్వరావు, వైస్ ఎంపీపీ, కె.గంగవరం

పోస్టాఫీస్‌లో సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకం రిజిస్ట్రేషన్

రామచంద్రపురం: ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని తపాలా కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయబడుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనుందన్నారు. 150 యూనిట్ల వినియోగానికి 1 కిలో వాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేయాలన్నారు. ఇందుకు రూ.55 వేల నుంచి రూ.65 వేల వరకు వ్యయం అవుతుందని ఆయన పేర్కొన్నారు. 1 కిలో వాట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల వరకు రాయితీ కలిప్తుందని తెలిపారు. సొంత ఇల్లు ఉన్న ప్రతి వారు ఈ పథకాన్ని అర్హులన్నారు. ఈ పథకం కింద 3 కిలోవాట్ల వరకు సబ్సిడీ కల్పిస్తున్నారని, దీనికి మీ సమీపంలోని పోస్టాఫీసులో సంప్రదించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం మొబైల్ నంబర్, గత నెల విద్యుత్ బిల్లును ఇవ్వాలన్నారు. మొదటి విడతలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కోటి మందికి సబ్సిడీ కల్పించనున్నారని మరిన్ని వివరాలకు 8500590045, 9493095398 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంగ్లీష్ పరీక్షకు నలుగురు గైర్హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి 128 మంది విద్యార్థులను అలాట్ చేయగా 124 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీర వెంకట నాగేశ్వరరెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్
- పసలపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం


పసలపూడి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు

రాయవరం: అమ్మ కడుపులో ఉన్న పాపాయి నుంచి.. ఆప్యాయంగా పలకరించే అవ్వ, తాతల వరకూ ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి, పథకాలు అమలు చేసి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. పసలపూడిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత పృథ్వీరాజ్ మాట్లాడుతూ సమాజంలోఅన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజల కష్టాలను దూరంగా చేయాలనే తలంపుతో, ఏ రాష్ట్రంలోని లేని విధంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి వారి ద్వారా ప్రజల ప్రతి అవసరాన్ని తీరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన చారిత్రాత్మక అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివద్ధి, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను గడప గడపకూ వెళ్లి అందజేశారు.పృథ్వీరాజ్ వెంట సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన నక్కా సింహాచలం, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ కర్రి విజేత, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పారిశ్రామిక వేత్తలు చింతా వెంకటరెడ్డి, చైతన్య రాజబాబు, సొసైటీ అధ్యక్షుడు చింతా రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్యనారాయణరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, కోకన్వీనర్ చింతా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం


ద్వారపూడి అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమమనేవి రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని ద్వారపూడిలో మంగళవారం పలు అభివృద్ధి పనులను సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ తులా రంగారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దంతులూరి శ్రీరామవర్మ, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరిలతో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన 3, 4 సచివాలయ భవనాలను ప్రారంభించారు. రూ.20 లక్షలతో హెల్త్ క్లినిక్, రూ.25 లక్షలతో రైతుభరోసా భవనం, రూ.12 కోట్లవిలువైన విద్యుత్ శాఖ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.80 లక్షలతో మార్కెట్ కమిటీకి సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలను చేపట్టినినాటి నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించానన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో చేపట్టిన ఇంటింటి పర్యటనలో ప్రజలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తూ వస్తున్నానని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోరుమిల్లి–మాచర రహదారికి మహర్దశ


కోరుమిల్లి ప్రధాన రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: కోరుమిల్లి–వల్లూరు 14 కిలోమీటర్ల ప్రధాన రహదారికి మహర్దశపట్టింది. రహదారి నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు మంగళవారం చురుగ్గా ప్రారంభించారు. పనులను వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ కోరుమిల్లి మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, సచివాలయ కన్వీనర్ పేరాబత్తుల రామకృష్ణ, నాయకులు సుంకర చిన్నా తదితరులు పరిశీలించారు. పృథ్వీరాజ్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో గ్రామాభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. పలు సీసీ రహదారులు, డ్రెయిన్లు నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీదే గెలుపు

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్


కాజులూరు ముత్యాలమ్మ వేపచెట్టు పేటలో శెట్టిబలిజ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బోస్

కాజులూరు: రానున్న ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీ మరోసారి గెలుపొందడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. కాజులూరు ముత్యాలమ్మ వేపచెట్టు పేటలో నూతన శెట్టిబలిజ కళ్యాణ మండపానికి ఎంపీ బోస్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పేదవాడు కూడు, గూడు, నీడలకు లోటు లేకుండా హాయిగా బతకాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆ దిశగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి మంచి పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా వాటిని లబ్ధిదారులకు అందజేయటంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. గతంలో ప్రతి చిన్న పనికి జిల్లా కలెక్టరేట్, మండల పరిషత్ తదితర కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను స్థానికంగానే అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గతంలో అర్హులకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసులు ఉండాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీల రూపంలో ఉన్న దళారులు ముడుపులు తీసుకుని వారికి నచ్చిన వారికే పథకాలు ఎంపిక చేసేవారన్నారు. జగనన్న పాలనలో పథకాలన్నీ పారదర్శకంగా నిజమైన అర్హులకే అందుతున్నాయన్నారు. ఇంత చక్కటి పాలన నిరంతరం అందాలంటే రాష్ట్రానికి జగనే మరలా సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, మురళి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, సర్పంచ్ దండంగి సరోజిని, యాళ్ళ సత్తిబాబు, కాదా నాగరాజు, పోతు శ్రీనివాసు, మాత నూకరావు, మేడిశెట్టి శ్రీను, కట్టా అప్పారావు మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు.. సంక్షేమానికి వారధి..


వలంటీర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అన్నపూర్ణ, విజయభాస్కర్‌రెడ్డి దంపతులు

కపిలేశ్వరపురం (మండపేట): వలంటీర్లు అందిస్తున్న సేవలు సంక్షేమానికి వారధిగా నిలుస్తున్నాయని మండపేట మండలం అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అన్నారు. గ్రామంలో విశేష సేవలందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన అవార్డులను సచివాలయంలో మంగళవారం సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి చేతులు మీదుగా అందజేశారు. వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు సంభవించాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత సందీప్‌రెడ్డి, నల్లమిల్లి రాంబాబు, తేతలి భూపతిరెడ్డి, వెలగల వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికలను సామరస్యపూర్వకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మండల ఓటరు నమోదు అధికారి డీవీఎస్ ఎల్లారావు కోరారు. మండపేట పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అందిన దరఖాస్తుల వివరాలను ప్రతినిధులకు వెల్లడించారు.

మండపేట పట్టణంలో కేంద్ర బలగాల కవాతు


మండపేటలో కవాతును ప్రారంభిస్తున్న బి.రాము, ఎస్పీ శ్రీధర్‌బాబు

కపిలేశ్వరపురం: ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం మండపేట పట్టణంలో 90 మందితో కూడిన కేంద్ర ఆయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణ వీధుల్లో చేసిన కవాతు ముందు భాగాన జిల్లా ఎస్పీ శ్రీధర్‌బాబు నడిపించారు. కవాతును పట్టణ కమిషనర్ బి.రాము ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు ప్రశాంతంగా వేసే వాతావరణాన్ని కల్పించేందుకు కవాతు నిర్వహించామన్నారు. కేంద్రం నుంచి మూడు దళాలు వచ్చాయని, అమలాపురం, రావులపాలెం, మండపేట పట్టణాల్లో ఆయా బలగాలు పనిచేస్తాయన్నారు. ఎన్నికలు ముగిసేవరకూ ఎలాంటి శాంతి భద్రతల సమస్యలను సృష్టించినా వెంటనే బలగాలు రంగంలోకి దిగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, సీఐలు దొరరాజు, శ్రీధర్ కుమార్, అఖిల్ జామ, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం ఎస్సైలు నాంచారయ్య, హరికోటి శాస్త్రి, నరేష్, పరదేశి పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ప్రచురణలో అభ్యంతరాలను తెలపాలి

కె.గంగవరం: ఈ ఏడాది దాళ్వాకు సంబంధించిన ఈ-క్రాప్ బుకింగ్ ముసాయిదా జాబితా ప్రచురణలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని రామచంద్రపురం ఏడీఏ ఏఎస్‌వీ రంగారావు సూచించారు. మండలంలోని బాలాంత్రంలోని ఆర్బీకే వద్ద మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ చాగంటి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ రంగారావు మాట్లాడుతూ దళ్వా పంటకు సంబంధించిన ఈ-క్రాప్ జాబితాను రైతులకు చదివి వినిపించారు. ఈ-క్రాప్ బుకింగ్ వల్ల రైతులకు ధాన్యం అమ్మకాలు, క్రాప్ ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అవసరాలు ఈ జాబితా ప్రాతిపదికనే రైతులకు అందుతాయన్నారు. రైతులందరూ శ్రద్ధ జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతారాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి.రవి, వ్యవసాయ సహాయకుడు అచ్యుత్‌కుమార్, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.